
సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్ డ్రా
కడప నగరం వైఎస్ రాజారెడ్డి- ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహించిన ఆంధ్రా, హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్ మంగళవారం డ్రాగా ముగిసింది. -8లో



నిధులు దండి.. నిర్మాణానికి గండి
చక్రాయపేట మండలపరిధిలోని గండి వీరాంజనేయస్వామి నూతన ఆలయ కుంభాభిషేకానికి రాజకీయ గ్రహణం పట్టింది. -8లో

గరిష్టం/కనిష్టం
35.0/15.6

వాతావరణం
జిల్లాలో మంగళవారం 15.6 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

8న జెడ్పీ సర్వ సభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న జరగాల్సిన జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కారణంగా ఈ నెల 8వ తేదీకి వాయిదా వేశామని ఆమె అందులో పేర్కొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



ప్రముఖుల చేతులమీదుగా బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థిని కళా జ్యోష్ణ

సింహాద్రిపురం: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో గత నెల 28, 29, 30వ తేదీల్లోజరిగిన జాతీయ స్థాయి సీనియర్ తైక్వాండో పోటీలలో సింహాద్రిపురం మండలం కోవరంగుంటపల్లె గ్రామానికి చెందిన రాచమల్లు కళా జ్యోష్ణ బంగారు పతకం సాధించినట్లు స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ నాయబ్ రసూల్ తెలిపారు. మంగళవారం నాయబ్ రసూల్ మాట్లాడుతూ కళా జ్యోష్ణ గుంటూరు విజ్ఞాన యూనివర్సిటీలో బీటె క్ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. విద్యార్థిని కళా జ్యోష్ణ ప్రతిభపై సీనియర్ కోచ్ బాషా, మాస్టర్ సలీం, తదితరులు అభినందనలు తెలిపారు.

కార్మికుడికి రూ.లక్ష విరాళం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: నగర పాలక సంస్థ కార్మికుడికి మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. మంగళవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపం వద్ద మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి దియ్యాల శివకుమార్ కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన కార్పొరేటర్‌లను అభినందించారు. కార్పొరేటర్ రామలక్ష్మణ రెడ్డి, డివిజన్ ఇంచార్జిలు ఐస్ క్రీమ్ రవి, త్యాగరాజు ,రెడ్డి ప్రసాద్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయాలి

రైల్వేకోడూరు అర్బన్: క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య గోపాల్ పేర్కొన్నారు. స్థానిక అనంతరాజుపేటలోని డాక్టర్ వైస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా, సాస్కృతిక పోటీలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా వీసీ గోపాల్, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9 ఉద్యాన కళాశాలల్లోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలన్నారు.

బలపనూరులో చిరుతల సంచారం!



చిరుతలు వెళ్లిన దారిని చూపుతున్న రైతు నందకిశోర్‌రెడ్డి

సింహాద్రిపురం: మండలంలోని బలపనూరు – రామాపురం సరిహద్దుల్లో రెండు చిరుత పిల్లలను చూసినట్టు బలపనూరుకు చెందిన నందకిశోర్‌రెడ్డి అనే రైతు పేర్కొన్నాడు. తోటలో పని చేసుకుంటుండగా.., రామాపురం దారిలో బీడు భూముల ముళ్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా ఏదో అలజడి రాగా తిరిగి చూశానని.. రెండు చిరుత పులుల పిల్లలు నెమళ్ల గుంపును వెంబడిస్తూ వెళ్లాయన్నారు. ఈ విషయం బహిర్గతం కావడంతో చుట్టుపక్కల వాళ్లు పెద్ద చిరుతలు ఉండొచ్చునేమోనని భయాందోళనతో జంకుతున్నారు. పోలీసు వారికి సమాచారం ఇచ్చానని రైతు పేర్కొన్నారు.

సడన్‌గా సమ్మర్!

ఫిబ్రవరి ప్రారంభం నుంచే సూర్యుడు నిప్పులు గక్కుతున్నాడు. క్రమక్రమంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అప్పుడే పగటిపూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడి ప్రతాపాన్ని తట్టుకోవడం కష్టమేననే ఆందోళన వెంటాడుతోంది. వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమవుతోంది.



- రెండు రోజులుగా భానుడి భగభగ
- ఫిబ్రవరిలోనే 35 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

రాజంపేట: వాయు కాలుష్యం..గోబ్లల్ వార్మింగ్ కారణంగా భూమి వేడెక్కుతోంది. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సడన్‌గా సమ్మర్ అన్నట్లుగా వేసవి ముందుగానే వచ్చేసింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండు రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. చలిక్రమంగా తగ్గుతోంది. సీజన్ మారిపోతోంది. తెల్లవారు జామున మాత్రం చలి తీవ్రత కనిపిస్తోంది. ఉదయం 8 గంటల వరకు దాని ప్రభావం ఉంటోంది. అనంతరం పగటి ఉష్ణోగ్రతలు ప్రభావం చూపుతున్నాయి.

2024 వేసవిలో రికార్డు ఉష్ణోగ్రతలు..

2024 వేసవిలో 50 డిగ్రీల వరకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలోనూ అంతే స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 2023లో ఆరునెలల సాధారణం కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2024లో అయితే ఏడాదంతా సాధారణం కన్నా ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- 1901 నుంచి సేకరిస్తున్న సమాచారం ప్రకారం 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఈ ఏడాది సగటు ఉష్ణోగ్రత 0.65 డిగ్రీలు పెరిగింది. గత ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కన్నా 0.37 డిగ్రీలు పెరిగింది. ఈ ఏడాది జనవరిలో సగటు ఉష్ణోగ్రత 0.94 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. 1958లో గరిష్టంగా 1.17 డిగ్రీలు, 1990లో 0.97 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆ తర్వాత ఈ ఏడాది జనవరిలో నమోదు అత్యధికం.

ఈ నెలలోనే 35 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు

ఈ నెలలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువయ్యాయి. రెండురోజులుగా ఉక్కపోత మొదలైంది. జిల్లాలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు వేడెక్కిస్తున్నాయి. సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉషోగ్రతలు ఉన్నాయి. ఉక్కపోత మరింతగా పెరుగుతుందని వాతావరణశాఖ తెలిపింది.

సిద్ధమవుతున్న శీతల పానీయాల వ్యాపారులు

భానుడి భగభగలకు అప్పుడే ప్రజలు శీతలపానీయాలవైపు మొగ్గు చూపుతున్నారు. షరబత్, బత్తాయి, చెరుకు రసాలకు గిరాకీ పెరిగింది. తోపుడు బండ్లు రోడ్లపైకి వచ్చేశాయి. దుకాణదారులు అధికంగా ఆర్డర్స్ పెట్టుకుంటున్నారు. ఐస్‌క్రీం పార్లర్‌తో తమకు గిరాకీ ఉంటుందని సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

» జనవరి నుంచి..

జనవరి చివరివారం నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. 30 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో కడప, రాయచోటి, బద్వేలు, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో ఉదయం వరకు మంచు కమ్మేసింది. 9గంటల తర్వాత భానుడి ప్రతాపం సాయంకాలం వరకు కొనసాగిన పరిస్థితులు చూశాం. ఆ పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. ఇప్పుడు వేసవి ఛాయలు అలుముకుంటున్నాయి. ఈ సారి ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి.

ఇప్పటి నుంచే వేసవి జాగ్రత్తలు పాటించాలి



ఫిబ్రవరి మాసం తొలి నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచి ప్రజలు ముందస్తుగా ఆరోగ్యపరమైన చర్యలు చేపట్టాలి. మార్చిలో 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయని సమాచారం. కనుక ముందుగానే వేసవిలో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కల్పించనుంది.

– డాక్టర్ కొండయ్య,
డీఎంఅండ్‌హెచ్ఓ, అన్నమయ్య జిల్లా.

బరిలో నిలిచి.. పతకం గెలిచి..

- షూటింగ్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన యూసుఫ్
- ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం
- పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి

మదనపల్లె సిటీ: మన దేశంలో ఇప్పుడిప్పుడు షూటింగ్‌బాల్ క్రీడకు ఆదరణ లభిస్తోంది. నేపాల్ దేశంలోఈ నెల 1 నుంచి 3 వరకు పోటీలు జరిగాయి. 3వతేదీ జరిగిన రెండవ ఆసియన్ షూటింగ్‌బాల్ ఛాంపియన్ షిప్ -2025 ఫైనల్స్ పోటీల్లో పాకిస్తాన్ జట్టుపై ఇండియా జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ దక్కించుకుంది. అందులో అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన కుర్రాడు యూసఫ్ విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. భవిష్యత్తులో షూటింగ్‌బాల్ క్రీడలో రాణించి దేశ కీర్తి ప్రతిష్టలు నిలుపుతానని చెబుతున్నాడు.

- తంబళ్లపల్లెకు చెందిన స్టాంప్‌రైటర్ మస్తాన్‌వలీ, షాహినాబేగం కుమారుడు మహమ్మద్ యూసుఫ్. ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో, కాలేజీ విద్య మదనపల్లె బీటీ కాలేజీలో చదివాడు. ప్రస్తుతం ప్రొద్దుటూరులో బీపీఈడీ కోర్సు చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి షూటింగ్‌బాల్ క్రీడ అంటే ఇష్టం. గత నాలుగేళ్లుగా కోచ్‌లు నరేష్, మురళి, ఖాదర్‌బాషా, రెడ్డిశ్రీనివాస్‌ల వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. జిల్లా స్థాయి నుంచి రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగాడు. 2017 నుంచి షూటింగ్‌బాల్ రాష్ట్ర కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటి వరకు కర్నూలు, తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఆటల్లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.



గోల్డ్‌మెడల్‌తో మహమ్మద్ యూసుఫ్

దాతల సహకారం

పేదరికం నుంచి వచ్చిన యూసుఫ్‌కు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్‌తో పాటు పలువురు దాతలు ముందుకు వచ్చి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం అందించారు. దాతల ఆశీస్సులతో ఫైనల్స్ మ్యాచ్‌లో రాణించి అందరి మన్నలు పొందాడు. ఈ సందర్భంగా జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి గౌతమి నరేష్ బాబు, ఉపాధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయిశేఖర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

హామీలను అమలు చేస్తాం

ఇన్‌చార్జి మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల హామీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాకు త్వరలో భారీ పరిశ్రమలు, సాగునీటి పథకాలు రాబోతున్నాయని తెలిపారు. డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఇప్పటికే ఏర్పాటు చేశామని, త్వరలో నోటిఫికేషన్ కూడా వెలువడనుందని చెప్పారు. పులివెందుల, కడపలో ఉన్న తాగునీటి సమస్యతో పాటు టిడ్కో, రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తొలుత కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ శాఖల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని మంత్రికి వివరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో మొదటి దశ ప్రతిపాదనలలో చేపట్టిన పనులు పూర్తి చేశామన్నారు. మినీ గోకులాల నిర్మాణం మార్చిలోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మార్చిలోపు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక మేళాలు నిర్వహించి మహిళా సంఘాలకు, యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఆరు ప్రధాన రిజర్వాయర్లలో 80 శాతం మేర నీరు నిల్వ ఉందని వెల్లడించారు. రబీ పంటలతోపాటు తాగునీటికి ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని వివరించారు. రహదారుల్లో పాట్ హోల్-3 పనులు ఈనెల 15వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు.

- ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాట్లాడుతూ తెగుళ్ల నివారణ, ఎరువుల వాడకం వంటి అంశాలపై ఆయా సీజన్లలో అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులకు సలహాలు ఇవ్వాలన్నారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఉద్యాన రైతులను ఇప్పటికే వివిధ కేటగిరీల్లో గ్రూపులుగా యాడ్ చేసి సలహాలు ఇస్తున్నామని కలెక్టర్ బదులిచ్చారు.
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చీనీ తోటలు ఎండుముఖం పట్టాయని, ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు.
- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న టిడ్కో గృహ సముదాయలు లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు.
- ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒంటరి మహిళల పేరిట చాలామంది అక్రమంగా పెన్షన్లు పొందారని తెలిపారు. అలాగే వికలాంగుల పెన్షన్లలో కూడా అవకతవకలు జరిగాయన్నారు. వీటిని సరిదిద్ది అర్హులకు అందేలా చూడాలని కోరారు. పాలెంపల్లెలో పశు వైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా రోజూ నీరందించేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

» విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే: మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప ఎడ్యుకేషన్: నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించి పాఠశాలతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని జిల్లా ఇంచార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం కడపలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలులో నిర్వహించిన 37వ క్రీడా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

క్రీడలవల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలలో గెలుపు, ఓటములు సహజం అని పిల్లలెప్పుడు పాజిటివ్‌గా ఉండాలన్నారు. ఆడపిల్లలు కూడా అన్ని రంగాలలో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు క్రమశిక్షణకు మారుపేరుగా ఉందని కొనియాడారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ముఖ్య పాత్ర వహిస్తాయన్నారు. క్రీడల వల్ల నాయకత్వపు లక్షణాలు వస్తాయని వివరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, పొలిట్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. తొలుత మంత్రి మార్చిపాస్ట్ వందనం స్వీకరించారు. క్రీడా దినోత్సవ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ షేక్ షంషుద్దీన్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ ఏం. వివేకానందరెడ్డి, ప్రిన్సిపల్ పి. హరి కృష్ణ, ఇంచార్జి సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటపతి.. జన హారతి

- జనసంద్రంలా దేవునికడప క్షేత్రం
- జిల్లా నలుమూలల నుంచి వెల్లువలా భక్తజనం

కడప కల్చరల్: ఇసుకేస్తే రాలనంత భక్తజనం మధ్య.. ఉవ్వెత్తున ఎగసిన ఆనందోత్సాహాల నడుమ .. కడప రాయని రథం వైభవంగా కదిలింది. బ్రహ్మదేవుడు సారథ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వతేజోమూర్తి సూర్యుని సాక్షిగా తేరు మేరు పర్వతంలా గంభీరంగా సాగింది. కడప రాయని బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహించారు. దేవునికడప వీధులన్నీ జనంతో నిండిపోయాయి. మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు రథంలోని దేవదేవుడిని తిలకించి పులకించారు.

కట్టలు తెగిన ఉత్సాహం

కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఉదయం స్వామి వారిని రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామిని దర్శించుకోవడంతోపాటు తేరుపై కొలువుదీర్చిన దేవతామూర్తులను దర్శించుకునే అరుదైన అవకాశం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచి దేవునికడపకు రావడం మొదలైంది. ఈ సంవత్సరం అర్చకుల ప్రత్యేకమైన విన్నపంతో తేరు ముందు ప్రత్యేకమైన, విశాలమైన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడంతోపాటు ఎక్కువ మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకోగలిగారు. ఉదయం నుంచే సాగిన ఈ దర్శనాలు మధ్యాహ్నం ముగిశాయి. తొలుత రథాన్ని కొద్దిగా కదిలించిన నిర్వాహకులు శుభ ఘడియాల కోసం మరికొద్దిసేపు వేచి ఉండి ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు తొలి పూజ లు చేసి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాత కడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు. ముందువైపు అశేష జనసందోహం పోటీలు పడి గొలుసులతో రథాన్ని లాగారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణలతోదేవునికడప మార్మోగింది. ఆ వీధుల్లోని మిద్దెలు, మేడలన్నీ జనంతో నిండిపోయాయి. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య మధ్యాహ్నం కదిలిన రథం మూడు గంటల పాటు మాడవీధుల్లో పయనించింది. అనంతరం ధూళి ఉత్సవం నిర్వహించారు.



దేవుని కడపలో రథంపై ఆశీనులైన స్వామివారు



చిన్నారి నృత్య ప్రదర్శన



ఒంటిమిట్ట రామాలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు

సేవలు: నగరంలోని కృష్ణా సర్కిల్ నుంచి రోడ్డుకు ఇరువైపు దుకాణాలు ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతాల్లో కూడా జనం కిక్కిరిసి కనిపించారు. స్వామి సేవకులు పలుచోట్ల శీతల పానీయాలు, అన్నదానాలు, అల్పాహారం అందజేశారు.

ఒంటిమిట్ట రామాలయంలో..

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా సీతారామ లక్ష్మణ మూర్తుల ఉత్సవ విగ్రహాలతో టీటీడీ వారు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు తొడిగి, తులసీ గజ మాలతో అలంకరించారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్ మహా మంగళహారతి ఇచ్చి గ్రామోత్సవానికి బయలుదేరారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



దేవుని కడపలో జరిగిన కడప రాయుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

అరటి పంట దగ్ధం

– రూ.6లక్షల మేర పంట నష్టం



కాలిపోయిన అరటి చెట్లు

లింగాల : లింగాల మండలం కర్ణపాపాయపల్లెలో రైతు ఎం.అంకాల్‌రెడ్డి రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందినకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించినట్లు రైతు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తోట వద్దకు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశామని, మరో మూడు ఎకరాల్లో అరటి పంట కాపాడుకోగలిగామన్నారు. అయితే రెండు ఎకరాలలో అరటి పంట పూర్తిగా దగ్ధమైందని, డ్రిప్ పరికరాలు కాలి బూడిద అయ్యాయన్నారు. సుమారు రూ.6లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గడ్డి పొలాలకు నిప్పు



పొలంలో ఎగసిపడుతున్న మంటలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె – కానపల్లెకు మధ్యలో ఉన్న గడ్డి పొలాలకు మంగళవారం సాయంత్రం నిప్పు అంటుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు టైర్లు కాల్చుతుండగా చుట్టుపక్కల ప్రాంతానికి మంటలు వ్యాపించి గడ్డి పొలాలు అంటుకున్నాయి. పెద్ద పెద్ద మంటలు ఎగసిపడుతుండటంతో కొత్తపల్లె, కానపల్లె ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మంటలకు గాలి తోడవ్వంతో కొత్తపల్లె వైపుగా వ్యాపించాయి. అతి దగ్గరలోనే ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

ద్వారకా నగర్‌లో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని ద్వారకా నగర్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ద్వారకా నగర్‌కు చెందిన రమణయ్య తన బంధువు దిన ఖర్మ ఉండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లారు. రాత్రి పది గంటల సమయంలో తిరిగి ఇంటికి రాగా అప్పటికే ఇంట్లో దొంగలున్నారు. తలుపు తీయగానే వారిని తోసుకొని దొంగలు పారిపోయారు. బీరువా పరిశీలించగా బంగారు నగలు కనిపించలేదు. దీంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమణయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నిధులు దండి.. నిర్మాణానికి గండి


- గండి ఆలయ పనుల నిర్వహణలో జాప్యం
- రూ.21 కోట్లు కేటాయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నిధులున్నా.. టెండర్లు పిలవడంలో ఆలస్యం
- నోటీసులిచ్చామని చేతులెత్తేస్తున్న అధికారులు

గండి వీరాంజనేయస్వామి నూతన ఆలయ కుంభాభిషేకానికి రాజకీయ గ్రహణం పట్టింది. కోట్ల రూపాయల నిధులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసినా ఆలయ పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోంది. ఒకవైపు భక్తుల తాకిడి పెరగడమేగాక.. ఆదాయం రెట్టింపు అవుతున్నా.. పనులు జరగడం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చక్రాయపేట : మండలంలోని గండి వీరాంజనేయ స్వామి ఆలయం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సాగుతోంది. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి మార్చి అభివృద్ధి చేశారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఒక్క పైసా నిధులు విదిల్చలేదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే.. గండి ఆలయానికి ఏకంగా రూ.14.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. అనంతరం ఆ మొత్తం రూ.21 కోట్లకు చేరింది. 80 శాతం మేరకు పనులు పూర్తి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడచినా.. పనులు కొనసాగడం లేదు.

ప్రొటోకాల్... కారణమా?

ఆలయాన్ని పునర్నిర్మించి కుంభాభిషేకం చేసిన అనంతరం ప్రొటోకాల్ ప్రకారం చైర్మెన్ పూజల్లో పాల్గొంటారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీకి చెందిన కృష్ణ తేజ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈయన పదవీ కాలం అధికారికంగా సుమారు ఏడాదిపాటు ఉంది. అయితే ఎలాగైనా వైఎస్సార్‌సీపీ పాలకమండలిని తొలగించి కూటమి బృందం ఆలయ పగ్గాలు చేపట్టేందుకు పావులు కదుపుతున్నారనే విమర్శలున్నాయి. అనంతరం కుంభాభిషేకం చేయించాలనే ఈ జాప్యం చేస్తున్నారని భక్తులు జోరుగా చర్చించుకుంటున్నారు. ఆలయ అధికారి కూడా ప్రస్తుతం ఉన్న పాలకమండలికి ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



నిర్మాణంలో ఉన్న గండి ఆలయం

పూర్తిగాని ఆలయ పనులు

ఆలయ నిర్మాణంలో భాగంగా రాతితో చేపట్టాల్సిన పనులు దాదాపు పూర్తయ్యాయి. విద్యుత్తు వైరింగ్, నీటి సరఫరా, గర్భాలయంలో సెంట్రల్ ఏసీ పనులతోపాటు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తే కుంభాభిషేకం చేసేందుకు అవకాశం ఉంది. శ్రీరామచంద్రుడు తన బాణంతో చెక్కిన ఆంజనేయుడి మూల విరాట్ దర్శనం కల్పించవచ్చు. ఈ పనులు త్వరితగతిన చేయించడంలో ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్ చొరవ చూపడం లేదు. టీటీడీ తరహాలో ఇత్తడి కటాంజనాలు(భద్రత కోసం), ఇత్తడి క్యూలైన్ల నిర్మాణం ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. ఆలయానికి వాయువ్యంలో ప్రసాదాల పోటు, స్వామి కైంకర్యాలకోసం బావి తవ్వించాల్సి ఉంది.

తెరపైకి వాస్తు కూడా

ఆలయానికి దక్షిణం, పడమర వైపున రాజ గోపురాల నిర్మాణం పూర్తయితే ఆలయ పనులు వేగవంతం అవుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. దక్షిణం వైపున రాజగోపురం సుమారు 90 శాతం పూర్తయింది. ఆ పనులను గుత్తేదారు ఆలస్యం చేస్తున్నారు. పడమటి వైపు రాజగోపురానికి పునాదులు తీసి వదిలేశారు. ప్రాకారం, రాతి చప్పట పనులు పట్టించుకోలేదు. రాజగోపురం, ప్రాకారం తదితరాలకు గత ప్రభుత్వంలోనే సుమారు రూ.10కోట్ల మేర నిధులు మంజూరు చేశారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు పిలవలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. గత ప్రభుత్వంలోనే సుమారు 80 శాతం మేర నిధులు చెల్లించారని, మిగిలిన బిల్లులు కూటమి ప్రభుత్వం ఇవ్వలేదనే విమర్శలున్నాయి.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం



పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశాం. ఇందుకు స్పందించిన కాంట్రాక్టర్ అవసరం మేరకు ముడి సరకు సిద్ధం చేయిస్తున్నామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. పనులు వేగవంతం చేసి కుంభాభిషేకం చేయించి భక్తులకు మూల విరాట్ దర్శనం కల్పిస్తాం. – వెంకటసుబ్బయ్య, ఆలయ సహాయ కమిషనర్

జాప్యం ఎందుకో తెలియదు



గండి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి కుంభాభిషేకం చేయడానికి ఎందుకు జాప్యం జరుగుతుందో తెలియదు. గండి ఆలయంతోపాటు అయోధ్యలో రామ మందిర నిర్మాణ పనులు ఒక నెల అటో ఇటో ప్రారంభించారు. అయోధ్యలో ఆలయ పనులు పూర్తిచేసి ఏడాది దాటింది. భక్తుల్లో విశ్వాసం సన్నగిల్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. – దివాకర్‌శర్మ, భక్తుడు, రాయచోటి

బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

రాజుపాళెం : మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని ఈ నెల 15, 16వ తేదీల్లో గ్రేటర్ రాయలసీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజుపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.15,016, రూ.12,016, రూ.10,016, రూ.8,016తో పాటు మెమెంటోలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారంతా పూర్తి వివరాలకు సెల్ నంబరు 9000659990, 9581899813లలో సంప్రదించాలని చెప్పారు.

రూ.50 కోసం యువకుడిపై కత్తితో దాడి



దాడిలో గాయపడిన ఖాజారసూల్

బద్వేలు అర్బన్ : రూ.50 కోసం ఓ యువకుడిపై ఆటో డ్రైవర్ కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి బద్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన ఖాజా రసూల్ ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఖాజావలి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇరువురూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో తరచూ కలిసి మద్యం తాగేవారు. సోమవారం రాత్రి మద్యం తాగిన ఖాజావలి బస్టాండు సమీపంలో ఉన్న ఖాజా రసూల్ వద్దకు వెళ్లి రూ.50 ఇవ్వాలని అడిగాడు. తన వద్ద లేవని, మా అమ్మమ్మ కనిపించకపోవడంతో ఆమె కోసం తిరుగుతున్నానని చెప్పినా ఖాజావలి వినిపించుకోలేదు. డబ్బు ఇవ్వనిదే ఇక్కడ నుండి వెళ్లనివ్వనని పట్టుబట్టడంతో ఖాజారసూల్ కోపంతో ఖాజావలిని పక్కకు నెట్టేశాడు. కోపోద్రిక్తుడైన ఖాజావలి తన ఆటోలో చాకు తీసుకుని ఖాజారసూల్‌పై దాడి చేశాడు. రసూల్‌కు స్వల్ప గాయాలవడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు అందలేదు.

ఘర్షణ కేసులో ఇరువురికి రిమాండ్

చాపాడు : మండలంలోని నెర్రవాడ గ్రామంలో గత నెల 19న పొలం తగాదాపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ కేసులో చల్లా గంగయ్య, వెంకటరమణలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ఇరు వర్గాలకు చెందిన 15 మందిపై కేసు నమోదైందని తెలిపారు.

ప్రమాదంలో ఐటీఐ ఉద్యోగి మృతి

వేంపల్లె : వేంపల్లె గ్రామంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేముల ఐటీఐలో పనిచేస్తున్న రమేష్ యాదవ్(35) మృతి చెందాడు. బంధువుల వివరాల.. వేముల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, నారాయణమ్మల కుమారుడు రమేష్ యాదవ్ అనే వ్యక్తి వేముల ప్రభుత్వ ఐటీఐలో అటెండర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. పెండ్లిమర్రి మండలంలోని తిప్పరాజుపల్లెలో శోభారాణిని వివాహం చేసుకున్నారు. తిప్పరాజుపల్లెలో నివాసముంటూ రోజూ వేములకు మోటారు బైకులో వెళ్లి వచ్చేవాడు. మంగళవారం విధులు ముగించుకొని వస్తుండగా.. వేంపల్లె ఫైర్ స్టేషన్ వద్ద ఒక్కన్నగారిపల్లెకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. రమేష్‌యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వేంపల్లె ఆసుపత్రికి తరలించారు. రమేష్ మృతి చెందడంతో భార్య శోభారాణి కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారుల మధ్య ఘర్షణ

చాపాడు : మండలంలోని కుచ్చుపాప సమీపంలో పల చెరువు వద్ద వ్యాపారులు సూర్యనారాయణ, భాస్కర్‌రెడ్డి మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో సూర్యనారాయణపై దాడి భాస్కర్‌రెడ్డి, అతడి భార్య, కుమారుడు శివారెడ్డి దాడి చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. చాపల వ్యాపారం చేస్తున్న భీమవరానికి చెందిన సూర్యనారాయణ, ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న భాస్కర్‌రెడ్డి మధ్య లావాదేవీల నడుమ సమస్య తలెత్తిందన్నారు. ఈ క్రమంలో మంగళవారం సూర్యానారాయణ రొయ్యల లోడు తరలిస్తుండగా భాస్కర్‌రెడ్డి అడ్డుకున్నారని తెలిపారు. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డి,తన భార్య, కుమారుడు దాడి చేసినట్లు సూర్యానారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఉరేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైష్ణవి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని నంగనూరుపల్లెలో బీటెక్ విద్యార్థి మేకల వైష్ణవి(19) ఉరేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. వైష్ణవి సీబీఐటీ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొన్నేళ్లుగా కడుపు నొప్పి రావడంతో యువతి తీవ్రంగా బాధపడుతూ ఉండేది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి చూపించినా నయం కాలేదు. వైష్ణవి మంగళవారం కాలేజీకి వెళ్లలేదు. వైష్ణవి తల్లి, సోదరుడు ఉదయాన్నే ట్రాక్టర్ తీసుకొని పెన్నానదిలోకి ఇసుక కోసం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే పైకప్పుకు చీరతో ఉరేసుకుంది. ఎస్ఐ సురేష్ గ్రామానికి వెళ్లి జరిగిన ఘటనపై విచారించారు. తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోరున విలపించిన స్నేహితులు

పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కడసారి తమ స్నేహితురాలిని చూసేందుకు పెద్ద ఎత్తున వైష్ణవి సీబీఐటీ కళాశాల విద్యార్థులు తరలి వచ్చారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తమ స్నేహితురాలు వైష్ణవి చదువులో టాపర్ అని, చనిపోవడం బాధగా ఉందని రోదించారు.

కౌన్సిల్ సమావేశం చట్ట విరుద్ధం

మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



సాధారణ సమావేశం చెల్లదని జీఓ చూపుతున్న చైర్‌పర్ పర్సన్, వైస్ చైర్మన్

ప్రొద్దుటూరు : సర్వ హక్కులు కలిగిన మున్సిపల్ చైర్ పర్సన్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపినా, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి టీడీపీ కౌన్సిల్ సభ్యులతో ఎలా సమావేశం నిర్వహిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో చైర్ పర్సన్‌తోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు కలిసి కమిషనర్ మల్లికార్జునకు విన్నవించారు. ఈ సందర్భంగా భీమునిపల్లి లక్ష్మీదేవి విలేకరులతో మాట్లాడుతూ గత నెల 31న సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తాను కమిషనర్‌కు తెలిపి, కౌన్సిలర్లకు లేఖలు కూడా పంపానన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి మరోమారు తెలిపానని పేర్కొన్నారు. తాను లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేతో కలిసి సమావేశాన్ని కొనసాగించారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ 10-7-1971 ఎంఏయూడీ యాక్ట్ 584 ప్రకారం చైర్ పర్సన్ లేకుండా నిర్వహించిన సాధారణ సమావేశానికి, ప్రవేశపెట్టిన అజెండాకు చట్టబద్ధత లేదన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో గతంలో ప్లాట్లు అమ్మిన డబ్బు ఏ విధంగా ఖర్చు చేశారు? నిర్వాసితులకు ఏ విధంగా డబ్బు చెల్లిస్తారో చెప్పాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సమావేశం చెల్లదని, అజెండాను రద్దు చేయాలని కలెక్టర్‌తోపాటు ఆర్డీడీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు లేఖలు పంపినట్లు తెలిపారు. తమకు న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఈ సమావేశంలో వరికూటి ఓబుళరెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, సత్యం, మునివంశీధర్‌రెడ్డి, బాలాజీ, జయంతి పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను కట్టడి చేద్దాం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : క్యాన్సర్‌ను కట్టడి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని, దీనిని అరికట్టడానికి ప్రభుత్వం ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇంటింటా తిరిగి 18 ఏళ్లకు పైబడిన స్త్రీకి రొమ్ము క్యాన్సర్, 30 ఏళ్ల పైబడిన మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, 18 ఏళ్ల పైబడిన స్త్రీలు, పురుషులకు నోటి క్యాన్సర్, రక్తపోటు, మధుమేహ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో అనుమానిత కేసులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేసి తుది నిర్ధారణ కోసం ప్రత్యేక అంకాలజీ యూనిట్ '222' ఓపీ విభాగానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీపీఎంఓ డాక్టర్ శోభూషణ్ రెడ్డి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటచంద్రా రెడ్డి, భారతి పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి పెద్దపీట



పోలీస్ డైరీ -2025ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్, తదితరులు

కడప అర్బన్ : క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఎలాంటి ఆపద కలిగినా.. తాను అండగా వుంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ హామీ ఇచ్చారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీస్ డైరీ -2025 ను జిల్లా ఎస్పీ ఈ. జి అశోక్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరంలో జిల్లా పోలీసులు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది కూడా సిబ్బంది, ప్రజలకు విలువైన, నాణ్యమైన సేవలందించడం ద్వారా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, వీరేష్, దూలం సురేష్, ఉప్పుశంకర్, ఏప్రిన్, సభ్యులు రామస్వామిరాజు, రాచరాయుడు పాల్గొన్నారు.

విదేశీ బీమా కంపెనీలతో దేశ భద్రతకు ముప్పు



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : విదేశీ బీమా కంపెనీలు దేశ భద్రతకు ముప్పు అని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నేత రఘునాథరెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 100 శాతానికి పెంచడం తగదన్నారు. విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను నేరుగా ఆహ్వానించడంతో బీమా రంగానికి, పాలసీదారులకు మేలు చేయదని తెలిపారు. పాలసీదారులకు సకాలంలో మొత్తం చెల్లిస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సి ఉందన్నారు. పార్లమెంటులో ఎఫ్‌డీఐని పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లు తీసుకువస్తే సమ్మెకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు సుధీకర్, నిత్యానంద రెడ్డి, అక్బర్‌బాషా, వసుప్రద, పారిజాతమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్, జయచంద్ర, అప్పయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు, యల్లయ్య, ఉద్యోగులు, పెన్షనర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం

యథేచ్ఛగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు

గోపవరం: గ్రామాల్లో బెల్టుషాపులకు వైన్ షాప్ ద్వారా మద్యం సరఫరా చేస్తే తొలిసారి రూ.5 లక్షలు, రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ మద్యం పాలసీని రద్దు చేసి పాత పద్ధతి ద్వారా అమ్మకాల విధానాన్ని ప్రవేశపెట్టారు. మండలంలోని పి.పి.కుంట వైన్‌షాపు నుండి నిత్యం బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్, పోలీసులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉదయం పది గంటల తర్వాత తెరవాలని నిబంధనలు ఉన్నప్పటికీ.. ఉదయం 6 గంటలకే తెరుస్తూ మద్యాన్ని విక్రయిస్తున్నారు. బెల్టు షాపులకు నేరుగా అక్కడ పనిచేసే సిబ్బందే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. బ్రాహ్మణపల్లె జెడ్పీ పాఠశాల చుట్టూ మందుబాబులు మద్యం తాగుతుండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. పాఠశాలకు సమీపంలోనే పోటాపోటీగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. బాటిల్‌పై స్టిక్కర్ తొలగించి బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నారు. స్టిక్కర్‌తో పట్టుబడితే సరఫరా చేస్తున్న విషయం అధికారులకు తెలిసిపోతుందని జాగ్రత్త పడుతున్నారు. బద్వేల్ ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి వివరణ కోరగా బెల్టుషాపులు లేకుండా నియంత్రిస్తామని, నిబంధనల మేరకే తెరిపిస్తామని తెలిపారు.

ఆంధ్ర– హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్ డ్రా



తలపడుతున్న ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్లు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం వైఎస్ రాజారెడ్డి- ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహించిన ఆంధ్రా, హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్ మంగళవారం డ్రాగా ముగిసింది. కల్నల్ సీకె.నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో 30 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 4వ రోజున 55.3 ఓవర్లతో 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని రేవంత్‌రెడ్డి 47, ప్రసాద 43 పరుగులు చేశారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్ రిత్విక్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్‌ప్రదేశ్ జట్టు 22.3 ఓవర్లతో 1 వికెట్ నష్టానికి 92 పరుగులు చేసింది, జట్టులోని యోగ్‌దీప్‌ఠాగూర్ 69 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా జట్టు 544 పరుగులు చేయగా, హిమాచల్‌ప్రదేశ్ జట్టు 436 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : తమకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ మండలంలోని గోపవరం సమీపంలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. పశు వైద్య కళాశాల నుంచి గోపవరం గ్రామంలోని జెండా చెట్టు వరకు ర్యాలీ చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటివరకూ తమ స్టైఫండ్ కేవలం రూ.7వేలు ఇస్తున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగినా స్టైఫండ్ పెరగలేదని, ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించేంత వరకు రోజూ నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ బూడిద ట్యాంకర్లకు అడ్డుకట్ట



చిలంకూరు ఫ్లైయాష్ బూడిద వాహనాలను అడ్డుకున్న ప్రజలు

ఎర్రగుంట్ల : ఫ్లైయాష్ బూడిద తో ఇబ్బంది పడుతున్నామంటూ చిలంకూరు గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం ఫ్లైయాష్ ట్యాంకర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాష్ బూడిదను టిప్పర్లు, ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారన్నారు. యజమానులు రూ.లక్షల ఆదాయం పొందుతున్నారని, తాము మాత్రం ఫ్లైయాష్ బూడిద ఇంట్లోకి చేరి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గతంలోనూ ట్యాంకర్లను అడ్డుకున్నామని, అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మళ్లీ రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి ఫ్లైయాష్ బూడిద గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.